క్లుప్తంగా

రూ.15 లక్షలతో ఈద్గా అభివృద్ధి



ముస్తాబైన ఈద్గా

కురిచేడు: స్థానిక ఈద్గాను జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో అభివృద్ధి చేసినట్లు ముస్లింలు పేర్కొన్నారు. గ్రామం ఆవిర్భావం నుంచి అభివృద్ధికి నోచుకోని ఈద్గాకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు నిధులు మంజూరు చేయడంతో చుట్టూ గోడలు, కింద అందరూ కూర్చుని ప్రార్థన చేసుకునేందుకు కాంక్రీట్‌తో ప్లాట్‌ఫాం నిర్మించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పవిత్ర రంజాన్‌లో చేయడం, రంజాన్ పర్వదినం రోజు ఈద్గాలో ప్రార్థనలు జరుపుకోవటం ఆనందంగా ఉందని ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అడగగానే పెద్ద మనసుతో నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్‌బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక అదృశ్యం

దొనకొండ: స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం బాలిక మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదుబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రుద్రసముద్రం గ్రామానికి చెందిన బాలిక దర్శిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. 19వ తేదీ రాత్రి 10 గంటలకు తండ్రి మిరపకాయల కళ్లానికి వెళ్లాడు. తెల్లవారు జామున 2 గంటలకు ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. ఎక్కడ చూసినా జాడ దొరకలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు బాలిక మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శివరామపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా నరేంద్ర

తాళ్లూరు: మండలంలోని శివరామపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా నాగంబొట్లపాలెం కార్యదర్శి పి.నరేంద్రను నియమించారు. శివరామపురం కార్యదర్శిని పద్మజను రామభద్రాపురం కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం చెరువు కట్టపై చెరువు కాపలాదారుల గుడిసె గురువారం మధ్యాహ్నం దగ్ధమై రూ.40 వేల ఆస్తి నష్టం జరిగింది. గుడిసెలో రెండు వలలు, మూడు లైట్లు, దుప్పట్లు, మంచం కాలిపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. మధ్యాహ్నం సమయంలో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం జరిగిందని, ఎవరైనా కావాలని నిప్పు పెట్టారా? లేక బీడీ, సిగరెట్ లాంటివి కాల్చుకుని పొలం వెళ్లేవారు అగ్గిపుల్ల విసిరేయడంతో ప్రమాదం సంభవించిందా? అనేది తేలాల్సి ఉంది.

యాక్సిడెంట్ చేసిన వ్యక్తి పట్టివేత

పర్చూరు (చినగంజాం): యాక్సిడెంట్ చేసి ఇరువురు యువకులను గాయపరచి.. వెళ్ళిపోయిన వ్యక్తిని పర్చూరు పోలీసులు సాంకేతికత సాయంతో పట్టుకున్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఇడుపులపాడు గ్రామానికి చెందిన ఇరువురు స్నేహితులు నూతలపాటి విజయ్‌కుమార్, ప్రవీణ్ తమ సొంత పనులు ముగించుకొని తమ ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. వారివురు అభయాంజనేయ స్వామి ఆలయం (ఆదిపూడి క్రాస్ రోడ్) వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి నలుపు రంగు బుల్లెట్ నడుపుతున్న వ్యక్తి అతివేగంగా, గుద్ది బండి ఆపకుండా వెళ్ళిపోయాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ఆధారంగా తనిఖీ చేసి యాక్సిడెంట్ చేసిన వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశారు.

100 శాతం నిర్మాణాలు పూర్తి కావాలి

జే.పంగులూరు: మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేక ప్రసాద్ అన్నారు. గురువారం పంగులూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పీడీ ప్రసాద్ పరిశీలించారు. ఎదుగుదల లేని చిన్నారులను గుర్తించి, పిల్లల వయస్సును బట్టి ఎత్తు, బరువు ఉండాలని వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. చిన్న వయస్సులో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తే అది భవిష్యత్తులో వారి ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందని తెలిపారు. చిన్నప్పటి నుంచి విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు, వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని జగనన్న కాలనీని పరిశీలించి నిర్మాణాలు వేగవంతంగా చేయాలన్నారు. జగనన్న కాలనీలో 100 శాతం నిర్మాణాలు పూర్తికావాలన్నారు. అనంతరం పంగులూరు సచివాలయం-2 ను పరిశీలించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి కావాలని తెలిపారు. కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. గురువారం పట్టణంలో 95వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పురవీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయా వీధుల్లో నెలకొని ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జగనన్న సంక్షేమం, అభివృద్ధిపై మూడేళ్ల పాలనలో అందించిన పుస్తకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. జగనన్న ప్రవేశ పెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగనన్న కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను



యువతికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్పు చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్ అంటూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలంటూ కోరుకుంటున్నారన్నారు. మండల ప్రజలు కూడా మళ్లీ జరుగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అన్నా రాంబాబు కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు దండు శశికళ, ప్రదీప్, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు షేక్ సుభానీ, తిరుమలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బాదం వేణుగోపాల్, సారె జనార్దన్ నాయుడు, రమణయ్య, గజ్జలకొండ వెంకటేశ్వర్లు, వెంగయ్యచౌదరి, ఏలూరి రమణయ్య పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు ఉపాధ్యాయుల కృతజ్ఞతలు



మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు మండలానికి 14 మంది ఎంపికయ్యారని, వీరిని వివిధ స్కూళ్లలో నియమించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమకు ఉద్యోగాలు ఇచ్చి తమ కుటుంబాల్లో ఆనందం నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పుడూ మరచిపోలేమని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట తప్పేవారు కాదని, ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారు ఉన్నత శిఖరాలు అధిష్టించే విధంగా కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు వైఎస్సార్ టీఎఫ్ సన్మానం

పొదిలి: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ టీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా ఎన్నికైన చంద్రశేఖరరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. సమన్వయంతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీతోపాటు పార్టీ కార్యదర్శి కేవీ రమణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాలిరెడ్డి, స్థానిక టీఎఫ్



సన్మానం అందుకుంటున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

నాయకులు బాపతు చిన్న యోగిరెడ్డి, పప్పుల శ్రీనివాసరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి(దోస్త్), మడతల శివారెడ్డి, బాదం రఘురామిరెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, ఉద్యోగుల సంఘ నాయకుడు గూడూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నా ప్రజల మనిషి

● చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కంభం: గిద్దలూరులో బుధవారం జరిగిన టీడీపీ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ మండల నాయకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు నిత్యం ప్రజల్లో ఉంటూ ఎవరు పిలిచినా పలికే నాయకుడని, అటువంటి నాయకుడిని పట్టుకొని చంద్రబాబునాయుడు గర్విష్టి అని చెప్పడం సమంజసం కాదన్నారు. మీరు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గిద్దలూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని వైఎస్సార్ సీపీలో గెలిచిన గత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కొనుగోలు చేయడమే మీరు చేసిన అభివృద్ధి అని విమర్శించారు. ఎమ్మెల్యే అన్నాను విమర్శించిన మీకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఎంపీటీసీలు రఫీ, నాగరాజు, ఆనంద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, కొత్తపల్లి శ్రీను, కటికల భాస్కర్, హుస్సేన్ బాషా, అంగం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దిగువమెట్టలో చలివేంద్రం ఏర్పాటు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఎన్‌ఎస్‌టీఆర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గుండ్లకమ్మ రేంజ్ ఆఫీసర్ జీవన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం పాదాచారుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీఆర్‌ఓ వంశీకృష్ణ, ఎఫ్‌ఎస్‌ఓ జమాల్‌వలి, ఎఫ్‌బీఓ శేఖర్, శివనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కంభం: కంభం-1, కంభం-3 సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సర్పంచ్ పల్నాటి బోడయ్య గురువారం సాయంత్రం ప్రారంభించారు. వేసవి తాపం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉప



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అటవీ అధికారులు

సర్పంచ్ సయ్యద్ ఖాసిం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, పంచాయతీ కార్యదర్శులు బ్రహ్మయ్య, వెంకటేశ్వరరెడ్డి, ఖాదర్, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, నాగరాజు, కో ఆప్షన్ సభ్యుడు సలీం, కటికల భాస్కర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుల విభాగం నాయకులు

మార్కాపురం: దివ్యాంగుల కోసం ప్రత్యేక సలహా మండలి ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాలరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో దివ్యాంగులకు కొన్ని ప్రత్యేక అంశాల్లో హక్కులు కల్పిస్తూ చేసిన చట్టం బుధవారం నుంచి అమల్లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెహమాన్, అశోక్, సురేంద్ర, వెంకటరమణ, రమణారెడ్డి, ఎల్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణకు మద్దతు కూడగట్టాలి

తాళ్లూరు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణకు నూతన ప్రజాస్వామ్య ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా పెద్దల మద్దతు కూడగట్టాలని ఆ సంస్థ జిల్లా కన్వీనర్ రావినూతల కోటి మాదిగ అన్నారు. తాళ్లూరులో గురువారం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కోటి మాదిగ మాట్లాడుతూ ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణకు 28 ఏళ్లుగా అనేక పోరాటాలు చేసినా రిజర్వేషన్ వర్గీకరణ మాత్రం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈ నెల 28న అద్దంకి అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ



మాట్లాడుతున్న రావినూతల కోటి మాదిగ

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. నాయకులు అదాం మాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు పల్లెపోగు త్రిపుర మాదిగ, మల్లెల ప్రసాద్, రేనమాల మాధవ మాదిగ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి అరటి పండ్ల పూజ

అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి గురువారం అమావాస్య సందర్భంగా పదివేల అరటి పండ్లతో పూజ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాతఃకాల సుప్రభాత సేవ,



అరటి పండ్ల పూజలో ప్రసన్నాంజ నేయస్వామి

గోపూజ , బిందెతీర్థం, అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, ఉభయదాతలు వేదస్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. వినాయక స్వామి, సుబ్రమణ్యస్వామి వార్లకు జీవధ్వజ ఉష్టవాహనానికి నారికేళి సమర్పించారు. అనంతరం 11 ఆవృత్తాలుగా స్వామివారికి 10 వేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. స్వామివారి మహా నివేదన, పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఉభయదాతలుగా సుద్దపల్లి సంజీవరావు, రాజేశ్వరీల కుమారుడు వెంకట సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

మార్కాపురం టౌన్: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, ఫైర్ ఆఫీసర్ వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. వంట రూమ్‌లో గ్యాస్ వినియోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ వెంకట్రావు

చిరుధాన్యాలు ఉపయోగించుకోవాలి

తాళ్లూరు: ప్రజలు చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలుసుకొని ఉపయోగించుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం ఆయన మాధవరంలో పర్యటించి చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. మాధవరంలో చిరుధాన్యాల నూర్పిడి యంత్రాన్ని పరిశీలించి నూర్పిడి విధానం అడిగి తెలుసుకున్నారు. కొర్రలు, అండ్రు కొర్రలు, ఊదలు, సామలు, అరికలు జల్లెడలు మార్చి నూర్పిడి చేస్తారని చెప్పారు. సజ్జలు, రాగులు పిండి పట్టడం, జొన్నలు పొట్టు తీసే యంత్రాలు కూడా పలు చోట్ల అందుబాటులో ఉన్నాయన్నారు. వీఏఏ సుధీర్, నాయక్ పాల్గొన్నారు.



నూర్పిడి యంత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారుల

ప్రైవేట్ స్కూళ్లలో ఏడుగురికి ఉచిత విద్య

యర్రగొండపాలెం: విద్యా హక్కు చట్టం కింద ఏడుగురు విద్యార్థులను గురువారం వివిధ ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. మండలంలో 30 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా లాటరీ పద్ధతి ద్వారా ఏడుగురు చిన్నారులు ఒకటో తరగతి ప్రవేశాలకు ఎంపికయ్యారు. వీరిని స్థానిక నలంద, చైతన్య స్కూళ్లలో చేర్పించినట్లు ఎంఈఓ వివరించారు.



అడ్మిషన్ పొందుతున్న చిన్నారి

అగ్నిమాపక శాఖ సేవలు గుర్తించాలి

గిద్దలూరు రూరల్: అగ్నిమాపక శాఖ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు రోజు సందర్భంగా గురువారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపకశాఖ అధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, అపార్ట్‌మెంట్, ఇతర వ్యాపార సముదాయాల్లో అక్కడి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి కాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, వాటి నుంచి ప్రజలు ఏ విధంగా రక్షించుకోవాలనే దానిపై సిబ్బంది సూచనలు, సలహాలు తెలియజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయురాలు భారతి, పలువురు ప్రముఖులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

ముండ్లమూరు: గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ సయీం అహ్మద్ ఆదేశించారు. మండలంలోని తమ్మలూరులో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి, రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రీసర్వే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలు చూపి సిబ్బందికి సహకరించాలన్నారు. నిర్ణీత గడువులోపు రీ సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే సమయంలో రైతులకు అభ్యంతరాలు ఉంటే ముందుగా తెలియజేయాలన్నారు. శాశ్వత పరిష్కారం



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

చూపేందుకే రీ సర్వే చేస్తారని చెప్పారు. సర్వే డీటీ రవికాంత్, సర్వేయర్ వెంకటరెడ్డి, వీఆర్వో రవి, రైతులు పాల్గొన్నారు.

24న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ వేలం

మార్కాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రస్తుత కూరగాయల మార్కెట్ స్థానంలో నిర్మించనున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు ఈ నెల 24వ తేదీన గుడ్‌విల్ పద్ధతిలో వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 40 గదులు, ఫస్ట్ ఫ్లోర్‌లో 40 గదులతో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు వివరించారు. అలాగే తర్లుపాడు రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద వెజిటబుల్ మార్కెట్ షెడ్లు 34, నాన్ వెజిటబుల్ షెడ్లు 20.. వెరసి మొత్తం 54 షెడ్లకు 26వ తేదీన గుడ్ విల్ ఆక్షన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు సాల్వెన్సీ సర్టిఫికెట్ రూ.4 లక్షలకు తీసుకురావాలని స్పష్టం చేశారు.

హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా కోటిరెడ్డి

తాళ్లూరు: ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈగా మన్నేపల్లి సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కాట్రెడ్డి కోటిరెడ్డిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. తాళ్లూరు హౌసింగ్ ఏఈ హనోహార్ కురిచేడుకు బదిలీపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా కోటిరెడ్డి నియమితులయ్యారు.